క్లుప్తంగా

అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



జీవీఎంసీ కార్యాలయానికి బస్సులో వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు. ప్రతి సోమవారం తనతో పాటు జీవీఎంసీ ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని చెప్పారు.

ఘనంగా కనకమాంబ తొలేళ్ల సంబరం



పూజలు అందుకున్న కనకమాంబ అమ్మవారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట గ్రామ ఇలవేల్పు శ్రీకనకమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణా ఉమామహేశ్వర సాయి దుర్గా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, జాకెట్‌లను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం అనువు మహోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని సంఘం గౌరవ అధ్యక్షుడు గొలగాని రాము, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, పల్లా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్టా శివ తెలిపారు.

రెండు యూనిట్ల రక్తం అందజేత

మద్దిలపాలెం : స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్త నిల్వలు సేకరించడం పెదజాలరిపేటకు చెందిన సోషల్ వర్కర్ ఒలిశెట్టి గురునాథ్‌కు అలవాటుగా మారింది. ఇలా సేకరించిన రక్త నిల్వలను బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచి, అత్యవసరంగా ఎవరికైన కావాల్సిన గ్రూప్ రక్తాన్ని సరఫరా చేస్తున్నారు. ఇలా సోమవారం బీ-పాజిటివ్ బ్లడ్ అవసరమని నరసింహులు అనే వ్యక్తి అడగ్గా.. గురునాథ్ రెండు యూనిట్ బ్లడ్‌ను అందించి ఆదుకున్నాడు. దీంతో బాధితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మహా ప్రస్థానంలో అనాథ శవం తరలింపు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు గొల్లలపాలెం మార్గంలో మృతి చెందిన ఓ అనాథ వ్యక్తి అంత్యక్రియలను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు నిర్వహించి తన మంచితాన్ని చాటుకున్నారు. సోమవారం అనాథ శవం ఉందని స్థానికులు దుర్గారావుకు సమాచారం అందించగా.. పోలీసులు, స్థానిక యువకుల సహాయంతో శవ పంచనామా చేయించి మహాప్రస్థానం ద్వారా శ్మశానానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు జరిపించారు.

అవధులు లేని ఆనందం



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థి

- తెరుచుకున్న పాఠశాలలు
- జగనన్న విద్యా కానుక అందుకున్న విద్యార్థులు



కేడీపీఎం పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

ఏయూ క్యాంపస్: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు తెరుచుకున్నాయి. సోమవారం ఉదయం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా తరలివచ్చారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించారు.

తొలిరోజునే జగనన్న విద్యా కానుక పంపిణీ

పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక(జేవీకే)ను అందజేశారు. తరగతుల వారీగా టీచర్స్ విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. బ్యాగ్, షూ, సాక్స్‌లు, నోట్స్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, బెల్ట్‌లతో కూడిన కిట్‌ను ప్రతి విద్యార్థికి అందజేశారు. వీటిని తీసుకున్న విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. కొత్త పుస్తకాలు, దుస్తులు తీసుకుని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

యూనిఫాంలో కొంత మార్పు

విద్యార్థులకు అందించే యూనిఫాం కలర్స్‌లో పెద్దగా మార్పు లేకున్నా అబ్బాయిలకు ఇచ్చే చొక్కాలో బ్లూకలర్‌పై చిన్న చెక్స్, బాలికలకు ఇచ్చే టాప్‌లో సైతం చిన్న చెక్స్ వచ్చేలా మార్పు చేశారు. వీటిని చూసిన విద్యార్థులు యూనిఫాం చాలా బాగుందని చెప్పారు.

మధ్యాహ్నం భోజనం

పాఠశాల అనంతరం జగనన్న గోరుముద్దలో భాగంగా తొలిరోజు నుంచే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. గుడ్డుతో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులు ఇష్టంగా తిన్నారు.

పాఠశాలలు కళకళ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం పరిధిలోని పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. ఆరిలోవ, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, చినవాల్తేరు, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం వరకు ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సోమవారం తెరుచుకున్నాయి. మొదటి రోజు కావడంతో పాఠశాలలకు తక్కువ మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో కూడా విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది. గురుకులంలో ఉన్న వారంతా ఉమ్మడి విశాఖ జిల్లాలో మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులే. వారిలో కొందరు సోమవారం గురుకులానికి చేరుకోగా.. మిగతా వారు ఒక్కొక్కరు వస్తున్నారు. మరో ఒకటి, రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యార్థులు గురుకులానికి చేరుకుంటారని ఇక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు.



కేడీపీఎం పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ తీసుకెళ్తున్న విద్యార్థిని



తోటగరువు హైస్కూల్ తరగతిలో విద్యార్థులు

జేవీకే కిట్లు బాగున్నాయి..



జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లు బాగున్నాయి. పుస్తకాల నాణ్యత బాగుంది. స్కూల్ బ్యాగ్, షూస్ ఏడాదికి సరిపడా అందజేశారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, తల్లిదండ్రులకు భారం లేకుండా స్కూల్ ప్రారంభించిన రోజు అందించడం ఆనందంగా ఉంది. జగన్ మావయ్యకు ధన్యవాదాలు.

– ఎం.ఆదిలక్ష్మి, 9వ తరగతి

ఆకర్షణీయంగా యూనిఫాం



ఈ ఏడాది అందిస్తున్న యూనిఫాంలో కొంత మార్పు చేశారు. షర్ట్ క్లాత్‌లో చిన్న చెక్స్ వచ్చాయి. దీంతో చూడడానికి ఆకర్షణీయంగా ఉంది. స్కూల్ ప్రారంభమైన రోజునే జగనన్న విద్య కానుక కిట్‌లు అందించడం సంతోషంగా ఉంది.

– ఓ.జోగేశ్వరరావు, పదో తరగతి, కేడీపీఎం పాఠశాల

నేరుగా పాఠశాలకే కిట్లు సరఫరా



జగనన్న విద్యా కానుక కిట్లను నేరుగా పాఠశాలకే సరఫరా చేశారు. దీంతో పంపిణీ ప్రక్రియ మాకు చాలా సులభమైంది. పాఠశాల హెచ్‌ఎంపై ఎటువంటి భారం లేకుండా ఈ ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్‌లను అందించడం ఆనందంగా ఉంది.

– సుమతీబాయి, హెచ్‌ఎం, కేడీపీఎం పాఠశాల

సెలవులను సద్వినియోగం చేసుకున్నాం..





వేసవి సెలవుల్లో పదో తరగతి పాఠ్య పుస్తకాలను చదువుకుని సద్వినియోగం చేసుకున్నాం. ఇంగ్లిష్, సైన్స్‌పై పట్టు సాధించాం. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పినది వినడానికి సులువుగా ఉంటుందని అమ్మా, నాన్న చెప్పడంతో రోజులో కొంత సమయం చదవడానికి కేటాయించాం. మిగిలిన సమయం స్నేహితులతో ఆడుకుని సరదాగా గడిపాం.

– అనిత, వంశీ, పదో తరగతి, తోటగరువు ఉన్నత పాఠశాల

జగనన్న విద్యా కానుక సిద్ధం



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ కోసం సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు

ఆరిలోవ: చినగదిలి మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలలు పునః ప్రారంభం రోజునే అన్ని తరగతులకు అందరి విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలు సిద్ధం చేయడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లకు స్టాక్ పాయింట్ పెట్టారు. అక్కడి నుంచి మండలంలో అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు.

- చినగదిలి మండలంలో 88 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో గోపాలపట్నంలో బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు హెచ్‌బీ వెంకటాపురం, కొత్తపాలెం, అడవివరం, తోటగరువు, చంద్రంపాలెం, యల్లపువానిపాలెం, ఎండాడ, సునీల్‌శర్మ కాలనీ, వాడపాలెం తదితర 11 ఉన్నత పాఠశాలలు, 5 గురుకులాలు, 2 మదర్సాలు(ఆరిలోవలో), 2 యూపీ, 68 ఎంపీపీ పాఠశాలలున్నాయి. ఆయా స్కూళ్లలో ఒకటి తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రస్తుతం 18,946 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో 6,641 మంది, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 12,305 మంది విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం..



మండలంలో జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నాం. విద్యార్థులకు సరిపడా కిట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే చాలా పాఠశాలలకు పుస్తకాలు పంపించాం. విద్యార్థులకు పంపిణీ కూడా జరుగుతుంది.

– ఎం.అప్పలరాజు, జగనన్న విద్యా కానుక కిట్ల స్టోర్ ఇన్‌చార్జి, సీఆర్‌పీ,

గురుకులం విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



శ్రీకృష్ణాపురం గురుకులంలో అధ్యాపకులతో మాట్లాడుతున్న డీసీ రూపావతి

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని గురుకులాల జిల్లా సమన్వయాధికారి(డీసీ) ఎస్.రూపావతి అన్నారు. వేసవి సెలవులు అనంతరం గురుకులాలు సోమవారం తెరుచుకున్నాయి. ఈ మేరకు ఆమె మొదటి రోజే శ్రీకృష్ణాపురం గురుకులాన్ని సందర్శించారు. ఇక్కడ అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది ఇక్కడ విద్యార్థులు పలుమార్లు కొట్లాటకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అధ్యాపకులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. తరగతి, వసతి గదుల్లో అల్లరి చేసే విద్యార్థుల్ని గుర్తించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేయాలన్నారు. అల్లరి మితిమీరితే వెంటనే టీసీలు ఇచ్చి గురుకులం నుంచి పంపించేయాలన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రమేష్

ఇటీవల గురుకులాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఇందులో భాగంగా ఇక్కడ ఇంత వరకు ప్రిన్సిపాల్‌గా పని చేసి ఫ్లోరెన్స్‌కు వేపాడ బదిలీ అయింది. ఈ స్థానంలో ఇక్కడ పూర్తి స్థాయి ప్రిన్సిపాల్‌ను ఎవరినీ నియమించలేదు. దీంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఇక్కడ భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న బి.కె.రమేష్‌ను నియమించారు. ఈయనకు గతంలో పలు గురుకులాల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఈ మేరకు సోమవారం డీసీ రూపావతి సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టి, చదువులో ముందుండే విధంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్‌లో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల కారణంగా చేకూరిన లబ్ధిని తెలియజేశారు. స్థానికంగా నెలకున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు సాకారం చేయాలన్న సంకల్పంతో జగనన్న ఇళ్ల మంజూరుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి పథకాన్ని ప్రజల వద్దకే చేరేలా వలంటీర్ల వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చారని చెప్పారు. ప్రజారంజకమైన పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్ట్ 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిళ్లా రమణమూర్తి, క్లోపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాతమూర్తి పాల్గొన్నారు.

కంటి శుక్లాలపై అవగాహన ఉండాలి

ఆరిలోవ: కంటి శుక్లాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పంకజ్ పరశురాం తెలిపారు. ప్రతి జూన్ నెలను శుక్లాల మాసంగా గుర్తిస్తారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన శుక్లాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. వయసు రీత్యా సాధారణంగా కంటిలో శుక్లాలు ఏర్పడతాయన్నారు. మధుమేహం, మూత్ర పిండాలు వ్యాధి, కంటి గాయాలు, కంటి ఇన్‌ఫెక్షన్ తదితర వాటితో బాధపడేవారితో పాటు దీర్ఘకాలిక మందులు వాడుతున్నవారిలో, పొగ తాగుతున్న వారిలోను ఈ శుక్లాలు పెరుగుతాయన్నారు. ఇవి వాహనాలు నడుపుతున్నప్పుడు, పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆటంకంగా మారుతాయన్నారు. అందుకే వాటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం శుక్లాల శస్త్ర చికిత్స పురోగతి చెందిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం కంటి అద్దాలు లేకుండా సమస్య పరిష్కరించవచ్చన్నారు.

ఎంవీపీలో విద్యుత్ కోతలపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీలో విద్యుత్ కోతలను నివారించాలని స్థానిక సెక్టార్ల నివాసితులు డిమాండ్ చేశారు. తరచూ కాలనీలోని పలు సెక్టార్లలో విద్యుత్ కోతలు విధిస్తుండడంపై విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రశ్నించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-2తో పాటు ఇతర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా రాత్రి పూట విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి పలువురు ఎంవీపీ సెక్టార్-7లోని విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో పసి పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్వర్ణ కంకణధారణ వేడుకకు ఆహ్వానం



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డితో వేణుమాధవ్

బీచ్ రోడ్డు: ఈ నెల 25న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు జరగనున్న స్వర్ణ కంకణ ధారణ వేడుకకు హాజరు కావాలంటూ ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం వీసీని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కలిసి ఆహ్వానం అందించారు. ఏయూలో జరిగే బీసీ గర్జనలో ఈ స్వర్ణ కంకణధారణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిట్టూరి సర్వేశ్వరరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అంబేడ్కర్ ఆలోచనలు ఆచరణ'

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను రాష్ట్రంలో ఆచరిస్తున్నారని రాష్ట్ర తల్లిదండ్రులు సంఘం అధ్యక్షుడు హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమానత్వంచాటే లా విద్యార్థులకు గొప్ప కానుకలు అందించడం అభినందనీయమని, దేశంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సర్కారు అని కొనియాడారు.

'స్పందన'కు 20 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా రంగానికి సీఎం జగన్ ప్రాధాన్యం



తోటగరువు ఎంపీపీ పాఠశాలలో విద్యా కానుక కిట్లు అందిస్తున్న వెంకటలక్ష్మి



వెంకోజీపాలెం పాఠశాలలో విద్యా కానుకలు అందిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని విద్యా విభాగం కార్పొరేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఇందిరానగర్, ఎస్‌బీజీ నగర్, తోటగరువు ప్రాథమిక పాఠశాలల్లో వెంకటలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జేవీకే కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ కనకరాజు, ప్రసాద్, శ్రీహరి, సాయి పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెం ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, నరాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎంవీపీ కాలనీ: నగరంలోని టైలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్‌కు విశాఖ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఎంవీపీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు పైడిరాజు మాట్లాడుతూ 2019లో జీవీఎంసీ మధురవాడ జోన్-2 కార్యాలయం పరిధిలో నగరంలోని 28 మంది టైలర్లకు ఇళ్లు కేటాయించారన్నారు. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేరే వారికి కేటాయింపులు జరిగిన ఇళ్లను ఖాళీ చేయించి టైలర్లకు ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం వాటిలో నివాసం ఉంటున్న టైలర్ల విజ్ఞప్తి మేరకు విద్యుత్ మీటర్లు సైతం ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. గత నాలుగేళ్లుగా 28 టైలర్ల కుటుంబాలు అక్కడ నివాసం ఉంటున్నాయన్నారు. అయితే ఇటీవల కొందరు ఆ ఇళ్లు తమవంటూ గొడవకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ టైలర్ ఇంటికి ఓ వ్యక్తి తాళాలు సైతం వేశారన్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్ రాజును కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డి.వెంకటేశ్వరి తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవన కార్యాలయంలో విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమష్టి కృషితోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలు పనిచేయకూడదని చట్టంలో ఉందన్నారు. దాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరముందని వెల్లడించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి, ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.